# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 03 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై లోక్‌సభలో చర్చకు అంగీకారం

**అఖిలపక్ష సమావేశం తర్వాత అధికార పక్షం నిర్ణయం**

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల రెండోరోజూ హంగామా కొనసాగిన నేపథ్యంలో ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ'పై లోక్‌సభలో చర్చకు అధికార పక్షం అంగీకరించింది. ఈ విషయాన్ని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు మీడియాకు వెల్లడించారు. రిజిజు ప్రకారం, డిసెంబర్ 8న వందేమాతరం గీతాపై, డిసెంబర్ 9న ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగనుంది. ఎన్నికల సంస్కరణల చర్చలో భాగంగానే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశాన్ని కూడా లోక్‌సభ ముందుకు తీసుకురానున్నారు. సోమవారం ప్రారంభమైన శీతాకాల సమావేశాల తొలి రోజే ప్రతిపక్షాలు 'సర్'పై చర్చించాలంటూ పట్టుబట్టాయి. దీనిపై ఉద్రిక్త నెలకొనడంతో సభను మంగళవారానికి వాయిదా వేశారు. ఇదే అంశం రాజ్యసభలోనూ ప్రతిధ్వనించింది. చర్చకు కాలపరిమితి విధించడం సరికాదని విపక్షం అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాకౌట్ చేసింది. చర్చకు తాము వెనుకాడదని, అయితే విపక్షం కోరిన

మిగితా 4వ పేజీలో

# ఖమ్మం అభివృద్ధి నా బాధ్యత



- నిజాయితీ గలసర్పంచులతోనే అభివృద్ధి
- గత ప్రభుత్వంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడం తన బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఏకైక ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం గర్వకారణంగా అభివర్ణించారు. "60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్. తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది ఈ నేలపై. అందుకే ఆయన పేరు వర్సిటీకి పెట్టడం ప్రజల అభిమానం ప్రతిఫలం" అని తెలిపారు.

ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలలో తెలంగాణను ప్రపంచపటంలో నిలబెడతాయని సీఎం పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

"భద్రాచలం రామలవారి సాక్షిగా చెబుతున్నా ఖమ్మం జిల్లాను అభివృద్ధి దిశగా నడిపించే బాధ్యత నాది" అని అన్నారు. "ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు మంచి ప్రభుత్వంతోనే సాధ్యం. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచివాళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే సర్పంచ్ లేకపోతే గ్రామాల అభివృద్ధి దెబ్బతింటుంది" అని సీఎం పేర్కొన్నారు. రాజకీయ కక్షలు విడిచి పెద్దల ప్రభుత్వానికి తోడుగా నిలవాలని, రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో అభివృద్ధిని నడిపించగల నాయకులను ఎన్నుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

ఆరు దశాబ్దాల కిందట తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్ష మొట్టమొదటగా పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతంలోనే పునాది పడిందన్న విషయాలను గుర్తుచేశారు. తెలంగాణ ఆకాంక్షను ప్రధానమంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు నెరవేర్చిన నేపథ్యంలో యూనివర్సిటీకి వారి పేరు పెట్టినట్టు వివరించారు.

దేశాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా నడిపించిన ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ గారని ప్రశంసించారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాలని పండిత్ జవహర్ లాల్ నెహ్రూ గారి స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం విద్య, నీటి పారుదల రంగాలకు ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అపారమైన ఖనిజ సంపదను గుర్తించడంతో పాటు సింగరేణి లాంటి పేరొందిన సంస్థలున్న ప్రాంతంలో ఖనిజ సంపదను గుర్తించడంతో పాటు పరిశోధన కోసం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ ను ఇక్కడ నెలకొల్పామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదేండ్లుగా నిర్లక్ష్యానికి గురైన నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. ఈ జిల్లాను అభివృద్ధి వైపు నడిపించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలన్న సంకల్పంతో విద్య, నీటి పారుదల రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు.



# పార్లమెంట్‌లో 2వ రోజూ ఆందోళనలు

- ఓటర్ల జాబితా సవరణపై విపక్షాల నిరసన
- లోక్‌సభ పలుమార్లు వాయిదా
- రాజ్యసభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై విపక్షాలు తీవ్ర ఆందోళనకు దిగడంతో పార్లమెంట్ ఉభయసభలు గందరగోళంతో దద్దరిల్లాయి. "ఓటు చోరీ.. గద్దీ చోరీ" అంటూ ప్రతిపక్ష ఎంపీలు నినాదాలు చేయడంతో సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి. లోక్‌సభలో పరిస్థితిని నియంత్రించేందుకు స్పీకర్ ఓం బిర్లా పలుమార్లు ప్రయత్నించినా పరిస్థితి అదుపులోకి రాలేదు. నినాదాలు, ఆందోళనలు కొనసాగుతుండటంతో ముందుగా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.

మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభ మళ్లీ సమావేశమైనా అదే గందరగోళం కొనసాగింది. దీంతో మరోసారి మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా విధించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కూడా పరిస్థితిలో మార్పు లేకపోవడంతో స్పీకర్ చివరకు సభను రేపటికి వాయిదా వేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెసు జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు అగ్రనేతలు ఈ నిరసనలలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా పని చేస్తోందని, ఓటర్లను తొలగించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని విపక్షాలు ఘాటుగా విమర్శించాయి.

'సర్'పై చర్చ జరగాలని రాజ్యసభలోనూ ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. తొలుత రాజ్యసభ చైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ జార్జియ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం జీరో అవర్‌ను ప్రారంభించారు. వివిధ అంశాలపై చర్చ చేపట్టాలని రూల్ 267 కింద ఇచ్చిన 20 నోటీసులను చైర్మెన్ తిరస్కరించారు. వెంటనే ప్రతిపక్ష ఎంపీలు సర్, ఇతర అంశాలపై చర్చకు పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ సర్ ఒక ముఖ్యమైన అంశమని, దానిపై వెంటనే చర్చించాలని డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగే పరిస్థితి లేకపోవడంతో చైర్మెన్

మిగితా 4వ పేజీలో

# డీఆర్డీవో మరో కీలక విజయం

- యుద్ధవిమాన పైలట్ ఎస్కేప్ సిస్టమ్ హై-స్పీడ్ టెస్ట్ విజయవంతం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశీయ రక్షణ సాంకేతికతలో భారత్ మరో ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. యుద్ధవిమాన పైలట్ల ప్రాణరక్షణకు అత్యంత కీలకమైన ఎస్కేప్ సిస్టమ్‌కు సంబంధించి డీఆర్డీవో నిర్వహించిన హై-స్పీడ్ రాకెట్ స్లెడ్ పరీక్ష విజయవంతమయ్యింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వశాఖ మంగళవారం అధికారిక ప్రకటనలో వెల్లడించింది.

**గంటకు 800 కి.మీ. వేగంతో పరీక్ష**

చండీగఢ్‌లోని టెర్మినల్ బాలిస్టిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీలో ఉన్న రైల్-ట్రాక్ రాకెట్ స్లెడ్ ఫెసిలిటీలో ఈ పరీక్షను గంటకు 800 కిలోమీటర్ల వేగంతో నిర్వహించారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో పైలట్ ఎజెక్షన్ సిస్టమ్‌ను పూర్తిస్థాయిలో పరీక్షించగలిగే దేశాల్లో భారత్ కూడా స్థానాన్ని సంపాదించింది.

డీఆర్డీవో తయారు చేసిన ఎస్కేప్ సిస్టమ్‌ను ఈ పరీక్షలో నియంత్రిత వేగంతో ముందుకు దూకేలా చేశారు.

పరీక్షలో భాగంగా కానోపీ సెవెరెన్స్, ఎజెక్షన్ సీక్వెన్స్, ఎయిర్‌క్రూ రికవరీ ప్రక్రియ చేయగా అన్నీ విజయవంతంగా జరిగాయని మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ పరీక్షను ఏరోనాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ , హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి.



ఎల్‌సీఏ ముందు భాగంతో డమ్మీ టెస్ట్

ఎల్‌సీఏ టేజస్ యుద్ధవిమానం ముందు భాగాన్ని ప్రత్యేకంగా రూపొందించిన డ్యూయల్ స్లెడ్‌కు అమర్చి, పలు రాకెట్ మోటార్ల ఇగ్నిషన్‌తో నియంత్రిత వేగాన్ని అందించారు.ప్రత్యేక మానవాకార డమ్మీ సహాయంతో పైలట్‌కు పరీక్ష సమయంలో వచ్చే లోడ్స్, మోమెంట్లు, యాక్సిలరేషన్ వంటి కీలక డేటాను నమోదు చేశారు. మొత్తం పరీక్షను హై-స్పీడ్ కెమెరాలతో రికార్డు చేశారు.

ఈ పరీక్షను భారత వాయుసేన, వైమానిక వైద్య విభాగం, ధ్రువీకరణ సంస్థల అధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ విజయంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్డీవో, ఐఏఎఫ్, ఏడీఏ, హెచ్‌ఏఎల్ తదితర రక్షణ సంస్థలను అభినందించారు. స్వదేశీ విమాన రక్షణ సాంకేతికతను బలోపేతం చేసే దిశగా ఇది ఒక పెద్ద ముందడుగని పేర్కొన్నారు.

# కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రెండో దశ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం సోమవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. రెండో రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. రాష్ట్రంలో 193 మండలాల్లోని 4,332 పంచాయతీలు, 38,342 వార్డులకు నిర్వహిచే ఎన్నికలకు సంబంధించి దాఖలైన నామినేషన్ల వివరాలను ఎన్నికల సంఘం అధికారులు సోమవారం వెల్లడించారు. మొదటి రోజు 2,976, రెండో రోజు 9,503 కలిపి మొత్తం సర్పంచ్ పదవి కోసం 12,479 నామినేషన్లు, వార్డు స్థానాలకు 30,040 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్ పదవికి అత్యధికంగా నల్లగొండలో 883, ఆ తర్వాత సిద్దిపేటలో701, అత్యల్పంగా ములుగులో 113, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో 190 నామినేషన్లు దాఖలయ్యాయి. 38,342 వార్డు స్థానాలకు గాను 30,040 నామినేషన్లు వచ్చాయి. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 2,070, ఆ తర్వాత సంగారెడ్డి జిల్లాలో 1,996, అత్యల్పంగా జోగులాంబ గద్వాల జిల్లాలో 341, ఆ తర్వాత నాగర్ కర్నూల్ జిల్లాలో 354 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో విడత నామినేషన్ల దాఖలుకు నేడు చివరిరోజు కాగా, బుధవారం వాటిని రిటర్నింగ్ అధికారులు పరిశీలించి గురువారం వెల్లడిస్తారు. కాగా రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు సగటున మూడు వరకు, వార్డు మెంబర్లకు ఒకటి కంటే తక్కువ నామినేషన్లు దాఖలయ్యాయి. కాగా బుధవారం మొదటివిడుత నామినేషన్ల ఉప సంహరణ అనంతరం తుది జాబితా ప్రకటించి, గుర్తులను కేటాయిస్తారు.

# ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఫుడ్ పాయిజన్ అయ్యి 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గద్వాల జిల్లా కేంద్రం బీమ్‌నగర్‌లోని ఎస్టీ హాస్టల్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఎస్టీ హాస్టల్‌లో 128 మంది విద్యార్థులున్నారు. మంగళవారం ఉదయం అల్పాహారం, అరటి పండ్లు, బిస్కెట్లు తిన్న తర్వాత విద్యార్థులు పాఠశాలకు వెళ్లారు. అరగంట అనంతరం 15మంది విద్యార్థులకు వాంతులు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించారు. ఉదయం పెట్టిన ఉప్మాలో పురుగులు వచ్చాయని పలువురు విద్యార్థులు తెలిపారు. కొద్దిసేపటికి కడుపునొప్పితో పాటు వాంతులు అయ్యాయన్నారు. దాంతో హాస్టల్ సిబ్బంది విద్యార్థులను వెంటనే గద్వాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు.

# భవిష్యత్తు తరాలకు ఫ్యూచర్ సిటీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భవిష్యత్తు తరాలకు ఫ్యూచర్ సిటీని అందించడంతోపాటు మెరుగైన అభివృద్ధి కోసమే గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్టు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌కు వచ్చే అతిథులకు ఏర్పాటు చేసిన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనుల వివరాలు, ఏర్పాట్లు, చేయాల్సిన పనులు, తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు మంత్రి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ విదేశాల నుంచి వచ్చే వీవీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. అధికారులు ఎప్పటికప్పుగు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ ప్రారంభానికి సమయం తక్కువగా ఉన్నందున అన్ని రకాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరానికి సరిపడా సిబ్బందిని సైతం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫోర్త్ సిటీ ఇన్‌చార్జి, కమిషనర్ శశాంక్, ఎమ్మెల్యే మాల్‌రెడ్డి రంగారెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్, టీపీసీసీ కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, దేపా భాస్కర్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.





# రాజ్‌భవన్ పేరు లోక్‌భవన్‌గా మార్పు

- పీఎంవో కొత్త పేరు 'సేవాతీర్థ్'
- తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంవో) కొత్తగా నిర్మించిన భవనానికి 'సేవాతీర్థ్' అనే పేరు పెట్టింది. సౌత్‌బ్లాక్ నుంచి కొత్త కాంప్లెక్స్‌కు పీఎంవో త్వరలోనే మారనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన ఈ భవనాన్ని ఇంతకుముందు ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌గా పిలిచేవారు. పీఎంవోతో పాటు కేబినెట్ కార్యదర్శిత్వం, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ , ఇండియా హౌస్ ఈ కాంప్లెక్స్‌లో ఉండనున్నాయి. విదేశీ ప్రతినిధులు, ప్రపంచ నాయకులతో ఉన్నత స్థాయి చర్చలు జరిపే కేంద్రంగా ఇండియా హౌస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంటోంది. విదేశాంగ వ్యవహారాల్లో ఇది కీలక పాత్ర పోషించనుంది. పరిపాలనకు కొత్త దిశను చూపుతూ 'సేవాతీర్థ్' అనే పేరు నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అధికారం కేంద్రంగా కాకుండా ప్రజలకు సేవలందించే వేదికగా ప్రభుత్వం నిలవాలనే భావన ఇందులో ఉన్నదని అధికారులు తెలిపారు. "అధికారం నుంచి సేవకు, ఆధిపత్యం నుంచి బాధ్యత వైపు వ్యవస్థలో మార్పు సంభవిస్తోంది" అని వారు వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ పరిపాలనలో విలువల మార్పును ప్రతిబింబించేలా గత కొన్నేళ్లుగా కేంద్రం పలు పేర్లను మార్చింది. రాజ్‌పథ్‌ను కర్తవ్య పథ్‌గా మార్చడం, ప్రధాని నివాసానికి లోక కళ్యాణ్ మార్గ్ అనే పేరు పెట్టడం, భారీ కేంద్ర కార్యాలయ సముదాయానికి కర్తవ్య భవన్ అనే కొత్త పేరు ఇవ్వడం వంటి నిర్ణయాలు ఈ క్రమంలో భాగమని అధికారులు తెలిపారు.

ప్రజల ముందు బాధ్యతను నిలబెట్టే విధంగా పరిపాలన భాష మారుతోందని అధికారులు తెలిపారు. సేవ, కర్తవ్యం, పౌరుడు అనే భావాలు పరిపాలనలో ప్రధానంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రం సూచించిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం రాజ్‌భవన్‌కు 'లోక్‌భవన్' అనే పేరు పెట్టుతూ తాజా నోటిఫికేషన్ జారీ చేసింది. గవర్నర్ల అధికారిక నివాసాలకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన కొత్త పేర్లను అమలు చేయాలన్న కేంద్ర ఆదేశాలపై ఈ మార్పు చేపట్టింది. మీకు కావాలంటే దీనిని చిన్న వార్త, బ్రేకింగ్ న్యూస్ స్టైల్, లేదా పత్రికలో రిపోర్టర్ బైలైన్‌తో కూడా తయారు చేసి ఇస్తాను.

# రెండు దశల్లో 'జనగణన'

- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు నిర్వహణ
- కేంద్రం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్ – సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోం వ్యవహారాల సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ జనగణన గురించి తెలిపారు. జనగణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు.

"2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో రెండో దశ జనగణన జరుగుతుంది. అయితే లద్దాక్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పబడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జనగణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు. అయితే ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు. మన దేశంలో జనగణనకు 150 ఏండ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాల ఆధారంగా తదుపరి జన గణనకు పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు.

2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మరో ప్రశ్నకు నిత్యానంద్ రాయ్ సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా కులగణనను కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని ఆయన లోక్‌సభకు తెలిపారు.

# కాంగ్రెస్ భూ కుంభకోణంపై 'బీఆర్ఎస్' పోరుబాట

- హిల్ట్ పాలసీతో రాష్ట్ర ప్రజలకు కలిగే నష్టంపై నిజనిర్ధారణ కోసం క్షేత్రస్థాయిలోకి గులాబీ దళం
- పారిశ్రామిక వాడల్లో పర్యటించేందుకు 8 నిజ నిర్ధారణ బృందాల ఏర్పాటు
- నాయకులకు దిశానిర్దేశం చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మహానగర పరిధిలోని రూ.5లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను, 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ' పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ సిద్ధమైంది. దీనిలో భాగంగా పార్టీ అధినేత కేసీఆర్ గారి ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారు రాష్ట్రవ్యాప్తంగా సీనియర్ నాయకులతో కూడిన 'నిజనిర్ధారణ బృందాలను' నియమించారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ గారు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయి పర్యటనలపై దిశానిర్దేశం చేశారు.

టెలికాన్ఫరెన్స్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపన కోసం, ఉపాధి కల్పన కోసం అతి తక్కువ ధరకే కేటాయించిన భూములను, ఇప్పుడు 'మల్టీ యూజ్ జోన్'పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మారుస్తున్నారని ఆరోపించారు. సుమారు 9,300 ఎకరాల భూములను మార్కెట్ విలువ కంటే అతి తక్కువకు, కేవలం ఎస్ఆర్ఓ రేటులో 30 శాతానికే రెగ్యులరైజ్ చేసి, సుమారు రూ. 5 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టడానికి, కనీసం స్మశాన వాటికలకు కూడా స్థలాలు లేవని చెబుతున్న ప్రభుత్వం, వేల కోట్ల విలువైన భూములను మాత్రం ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు.

**3, 4 తేదీల్లో పారిశ్రామిక వాడల్లో పార్టీ బృందాల క్షేత్రస్థాయి పర్యటనలు**

ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడలను 8 క్లస్టర్లుగా విభజించి, పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో బృందాలు పర్యటించనున్నాయి. అక్కడ స్థానిక నాయకులను, ప్రజలను కలుపుకొని వాస్తవ మార్కెట్ విలువకు, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఉన్న భారీ వ్యత్యాసాన్ని ప్రజల ముందు ఉంచనున్నారు. వీటితో పాటు అక్కడి పారిశ్రామిక వాడల ద్వారా ప్రజా ఉపయోగ కార్యక్రమాలు ఏమేమి చేయవచ్చు, అక్కడి స్థానిక ప్రజల సుదీర్ఘకాలం డిమాండ్లను ఆకాంక్షలను కూడా పార్టీ నేతలు తెలుసుకోనున్నారు. ఒకప్పుడు అక్కడ పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం ప్రజలు భూములు ఇచ్చిన తీరును ప్రభుత్వం కేటాయించిన తీరును వాటిని అత్యంత చవకగా పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వాలు కట్టబెట్టిన అంశాన్ని, వాటి ఉద్దేశాలను పార్టీ నేతల బృందాలు ప్రస్తావించనున్నాయి.

మిగితా 4వ పేజీలో

# గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానాలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రాష్ట్రాల సీఎంలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్య మంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. రాష్ట్ర మంత్రులు స్వయంగా వెళ్లి వారిని ప్రత్యేకంగా కలిసి సదస్సుకు ఆహ్వానిస్తారు. ఈ నెల 4న మంత్రులు ఆయా రాష్ట్రాలకు వెళ్లి డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు. ఎవరెవరు ఏఏ రాష్ట్రాలకు వెళ్లాలో సీఎం మంగళవారం ఖరారు చేశారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్ ,హర్యానాకు దామోదర రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్ణాటక, తమిళనాడుకు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తరప్రదేశ్‌కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్తాన్‌కు పొన్నం ప్రభాకర్ వెళ్లి ఈ ఆహ్వాన లేఖలను అందిస్తారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌కు కొండా సురేఖ, పశ్చిమ బెంగాల్‌కు సీతక్క, మధ్యప్రదేశ్‌కు తుమ్మల నాగేశ్వరరావు, అసోంకు జూపల్లి కృష్ణారావు, బీహార్‌కు వివేక్ వెంకటస్వామి, ఒడిశాకు వాకిటి శ్రీహరి, హిమాచల్‌ప్రదేశ్‌కు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహారాష్ట్రకు మహమ్మద్ అజారుద్దీన్ ఆహ్వాన లేఖలను అందిస్తారు. కాగా ఢిల్లీ సీఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లకు రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఆహ్వానం అందించనున్నారు.

# పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పకుంటేనే సినిమాలు ఆడనివ్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ వారి దిష్టి తగిలింది" అన్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై తెలంగాణలో రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అవమానపరిచేలా ఉన్నాయని ఆగ్రహించిన తెలంగాణ మంత్రులు వెంటనే పవన్ కల్యాణ్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. "కోనసీమకు తెలంగాణ ప్రజలు దిష్టి పెట్టారనడం

మిగితా 4వ పేజీలో

# ఏపీలో సంచలనంగా మారిన ఐఏఎస్ అధికారి కూతురి ఆత్మహత్య



**బలగం టీవీ, ఆంధ్రప్రదేశ్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఓ ఐఏఎస్ అధికారి కూతురు ఆత్మహత్య కేసు సంచలనం రేకెత్తిస్తోంది. ప్రేమ వివాహం చేసుకున్న ఎనిమిది నెలలకే ఏపీ ఎస్సీ కార్పొరేషన్ సెక్రటరీ చిన్న రాముడు కూతురు మాధురి సాహితి బాయి (27) తాడేపల్లిలోని తన పుట్టింట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై యువతి తండ్రి, భర్త పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్నారు.

తాడేపల్లిలోని నవోదయ కాలనీలో నివసించే సాహితి బాయి, సుమారు ఎనిమిది నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన రాజేష్ నాయుడు అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే, పెళ్లయిన కొద్ది కాలానికే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో, గత రెండు నెలల నుండి సాహితి బాయి తన తండ్రి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో నిన్న ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తన కూతురి మరణానికి అల్లుడు రాజేష్ నాయుడు వేధింపులే కారణమని ఐఏఎస్ అధికారి చిన్న రాముడు ఆవేదన వ్యక్తం చేశారు. భర్త వేధింపుల కారణంగానే తన కూతురు మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని ఆయన ఆరోపిస్తున్నారు.

మరోవైపు, సాహితి బాయి భర్త రాజేష్ నాయుడు మాత్రం ఇది ఆత్మహత్య కాదని, పరువు హత్య అని ఆరోపిస్తున్నాడు. తన భార్య ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, పైగా ఆమె గర్భవతి అని వెల్లడించారు. ఈ ప్రేమ వివాహం ఇష్టం లేని సాహితి బాయి తల్లిదండ్రులే ఆమెను హత్య చేసి, దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. తన భార్య మృతదేహాన్ని తనకు అప్పగిస్తే తానే అంత్యక్రియలు నిర్వహిస్తానని రాజేష్ నాయుడు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ ఆయన నంద్యాల ఎస్పీకి వినతి పత్రం కూడా అందజేశారు. ప్రేమ వివాదం, ఆత్మహత్య, అత్తింటి వేధింపులు, పరువు హత్య ఆరోపణల నేపథ్యంలో ఈ కేసు ఏపీలో ప్రస్తుతం సంచలనంగా మారింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బైక్ అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో దుర్ఘటన

- **చికిత్స పొందుతూ అనురాగ్ మృతి**



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తండగొండ గ్రామానికి చెందిన యువకుడు ఎడపెల్లి అనురాగ్ (22) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన విషాదం నింపింది. 30-11-2025 రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అనురాగ్ తన స్నేహితుడు పిట్టల అఖిల్ నడుపుతున్న పల్సర్ బైక్ (TG 23 9249) పై బోయినిపల్లి నుండి తమ గ్రామం వైపు వస్తుండగా, చెపూరి కనకయ్య వ్యవసాయ క్షేత్రం సమీపంలోని రోడ్ టర్నింగ్ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో అనురాగ్ తీవ్రంగా గాయపడగా, అఖిల్ కూడా గాయాలపాలయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనురాగ్‌ను కరీంనగర్ అఖిర్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతున్న అనురాగ్ 02-12-2025 ఉదయం 10.08 గంటలకు మరణించాడు. మృతుడి తండ్రి ఎడపెల్లి రాజేశం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా బైక్‌ను నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైన పిట్టల అఖిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

# కొండగట్టు బాధితులకు రూ.30 లక్షల పరిహారం ఇవ్వాలి..




**బలగం టీవీ, హైదరాబాద్**

కొండగట్టు అగ్నిప్రమాద ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కొండగట్టులో జరిగిన నష్టం వివరాలను మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ని అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన ఒక్కో కుటుంబానికి రూ. 30 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సకాలంలో ఫైర్ ఇంజన్ రాకపోవడమే ఆస్తి నష్టం భారీగా జరగడానికి ప్రధాని కారణమని మండిపడ్డారు. ఇది ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనం అన్నారు.

# ఓయూలో మరోసారి విద్యార్థుల ఆందోళన

**బలగం టీవీ, హైదరాబాద్**



ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టళ్లలో నాసిరకం ఆహారం వడ్డిస్తున్నారని విద్యార్థులు మరోసారి రోడ్డెక్కారు. మంగళవారం రాత్రి భారీ సంఖ్యలో విద్యార్థులు ప్రధాన రహదారిపై బైఠాయిస్తూ ఆందోళన చేపట్టారు. హాస్టళ్లలో వడ్డిస్తున్న భోజనం పాడైపోయినదేనని, ఆహారం నాణ్యత అత్యంత దారుణంగా ఉందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేకసార్లు వార్డెన్లకు, ప్రిన్సిపల్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. నాసిరకం ఆహారం కారణంగా అనారోగ్యానికి గురవుతున్నామని, వెంటనే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు అందించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

# నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంచార్జి కలెక్టర్

- **బోయినిపల్లి ఏఎంసీలో ధాన్యం కొనుగోళ్ల పరిశీలన**

**బలగం టీవీ, బోయినిపల్లి**

గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు. బోయినపల్లి లోని ఆర్ఓ కేంద్రంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను తనిఖీ చేశారు. నామినేషన్ తోపాటు అభ్యర్థి నూతన బ్యాంక్ ఖాతా కచ్చితంగా ఉండాలని, అన్ని వివరాలు నింపాలని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించిన తరువాత వారితో ఎన్నికల నియమావళి, వ్యయం వివరాల అందజేతపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

అనంతరం హెల్ప్ డెస్క్ పరిశీలించి, అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. బోయినిపల్లి జడ్పీ హై స్కూల్ ఆవరణలో



ఏర్పాటు చేయనున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని తనిఖీ చేసి, చేయాల్సిన ఏర్పాట్లపై ఎంపీడీఓ కు సూచనలు చేశారు.

**లారీలు అందుబాటులో ఉండాలి..**

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అవసరమైన మేర లారీలు అందుబాటులో ఉండాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బోయినపల్లి మండల కేంద్రంలోని ఏఎంసీ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం, తూకం తనిఖీ చేశారు.

అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన టార్పాలిన్, వసతులు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే సమీప రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ధాన్యం నిలువలకు అనుగుణంగా లారీలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చంద్ర ప్రకాశ్. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల తదితరులు పాల్గొన్నారు.

### మహిళ భద్రతపై విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో

# ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

- **రాజన్న సిరిసిల్ల జిల్లా షీ టీమ్**
- **సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచనల మేరకు జిల్లా షీ టీమ్ ప్రతిరోజూ విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్ టచ్ / బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టం, షీ టీమ్ సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గత నెలలో జిల్లాలో వేధింపులకు పాల్పడిన వారిపై 2 FIR, 02 పెట్టి కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను షీ టీమ్ బృందం ఈరోజు సందర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించి, వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425 కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించాలి




**బలగం టీవీ, బోయినిపల్లి**

- **మండల ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలి**
- **ఎస్సై రమాకాంత్**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం దేశాయిపల్లి,వర్ధవెలి, గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలపై అవగాహన కల్పిస్తూ జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు మండల ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్సై రమాకాంత్, పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఎస్.ఐ రామాకాంత్ మాట్లాడుతూ:ఎన్నికల నేపథ్యంలో మండలంలోని ప్రజలకు పలు సూచనలు జారీ చేసారు. స్వేచ్ఛా,నిష్పక్షపాత, ఎన్నికలు జరగాలంటే ప్రతి ఓటరు బాధ్యతతో వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో చట్టం,శాంతి, పరిరక్షణకు ప్రజల సహకారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. రాజకీయ కారణాలతో వివాదాలు, గుంపుల ఘర్షణలు సృష్టించే ప్రయత్నాలు చేయరాదని హెచ్చరించారు. సామరస్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అక్రమ ప్రయోజనాల కోసం డబ్బు, మద్యం, బహుమతులు, స్వీకరించడం నేరమని, ఇలాంటి చర్యల్లో పాల్గొనే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా తప్పుడు ప్రచారం, పుకార్లు, వ్యాప్తి చేయడం కూడా శాంతి భద్రతలకు ప్రమాదకరమని హెచ్చరిం చారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని, అనుమానాస్పద కదలికలు, బెదిరింపులు, అక్రమ రవాణా, లేదా బహుమతుల, పంపిణీ కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

# మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి

- **తెగిన చెవి**

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ శివగంగ కాలనీలో మంగళవారం దారుణం చోటుచేసుకుంది. ఇంటి ముందు ఆడుకుంటున్న ఒక మూగ బాలుడిపై వీధికుక్కలు తీవ్రంగా దాడి చేసి గాయపర్చాయి. ఈ దాడిలో బాలుడి కుడి చెవి పూర్తిగా తెగిపోవడంతో పాటు తల, నడుము, వీపు భాగాల్లో లోతైన గాయాలు ఏర్పడ్డాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన తిరుపతి రావు, చంద్రకళ దంపతులు వారు మూడేండ్ల క్రితం నగరానికి వలస వచ్చిన కుటుంబం కూలి పని చేసుకుని జీవనం సాగిస్తోంది. దంపతుల కుమారుడు ప్రేమ్ చంద్ పుట్టుకతోనే మూగవాడు. మంగళవారం తండ్రి రోజు మాదిరిగా మేస్త్రి పనికోసం వెళ్ళాడు. తల్లి ఇంట్లో పని చేసుకుంటుండగా బాలుడు ఆడుకోవడానికి బయటకు రావడంతో ఒక్కసారిగా సుమారు 10 వీధి కుక్కలు దాడి చేసి అతని తల, నడుము, కుడి చెవి, వీపు భాగాలను కరవడంతో తీవ్ర గాయలపాలయ్యాడు. ఆ బాలుడిని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నీలోఫర్‌కు తరలించారు.

## తిరుమల వైకుంఠ ద్వార దర్శనానికి రికార్డు స్థాయిలో స్పందన

- **1.80 లక్షల టోకెన్లకు 24 లక్షల రిజిస్ట్రేషన్లు!**

**బలగం టీవీ, తిరుమల**



తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి రికార్డు స్థాయిలో స్పందన, వైకుంఠ ద్వార దర్శనానికి భక్తుల నుంచి భారీ స్పందన, 1.80 లక్షల టోకెన్లకు 24 లక్షలకు పైగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, తొలి మూడు రోజుల దర్శనానికి లాటరీ పద్ధతిలో టోకెన్ల కేటాయింపు, డిసెంబర్ 2న ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా అదృష్టవంతుల ఎంపిక, సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ టీటీడీ ఏర్పాట్లు

## రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంట వెంటనే డబ్బు జమ కావాలి..

- **ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేయాలి.**
- **1,98,426 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ, రూ. 338 కోట్లు రైతులకు చెల్లింపు.**
- **టెలి కాన్ఫరెన్స్ లో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల బ్యాంకు ఖాతాల్లో వెంట వెంటనే డబ్బు జమ కావాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు, ట్యాబ్ ఎంట్రీ, డబ్బుల చెల్లింపు తదితర అంశాలపై జిల్లా పౌర సరఫరా అధికారి, డీఎం, డీసీఓ, మెప్మా, ఐకేపీ, డీసీఎంఎస్ జిల్లా అధికారులు, సిబ్బందితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి సోమవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఇంచార్జి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ టీసీలో మాట్లాడుతూ.. ఈ సీజన్ లో ఇప్పటిదాకా 239 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 32,085 మంది రైతుల నుంచి 1,98,426 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రూ. 338 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని వెల్లడించారు. మిగతా రైతుల వివరాలు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ వేగంగా పూర్తి చేసి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు.

## ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు..

- **డీఎస్పీ నాగేంద్రచారి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



సర్పంచ్ ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి హెచ్చరించారు. అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాల్లో డబ్బు పంచడం, ఓటర్లను ఆకర్షించడం లేదా కుల సంఘాలకు డబ్బు ఇవ్వడం వంటివి చేస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పక పాటించాలని ఆయన కోరారు.



## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ నేడు టీయూడబ్ల్యూజే ధర్నా..

**ఇల్లంతకుంట లో కరపత్రాల ఆవిష్కరణ**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నా కరపత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు వీరాహత్ అలీ, జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ ల పిలుపు మేరకు టీయూడబ్ల్యూజే మండల అధ్యక్షుడు మారుపాక అనిల్ కుమార్ మండల ప్రెస్ క్లబ్ సభ్యులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. జర్నలిస్టులకు కొత్తగా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలని ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని,వృత్తి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిసెంబర్ 3న హైదరాబాద్ మసాబ్ ట్యాంక్‌లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరగనున్న మహా ధర్నాకు రాష్ట్ర, జాతీయ, జిల్లా, మండల నాయకులు తోడ్పడాలని, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తూముకుంట శ్రీనివాస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు రాకం సుమన్, ఏనుగుల మహేందర్, కొయ్యడ రాజయ్య, కముటం పర్శరాం, కందారం ఆంజనేయులు, గుండ రవిందర్, బండారి శ్రీనివాస్,కాసుపాక శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఈసీ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి

- **పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలి..**
- **మౌలిక సదుపాయాలు తనిఖీ చేయాలి..**
- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**
- **గ్రామ పంచాయతీ ఎన్నికల ఆర్ఓలకు శిక్షణ.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు(ఆర్ ఓ) లకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు వివిధ అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి కుమార్ తో కలిసి శిక్షణ ఇచ్చారు. పీపీటీ ప్రదర్శన ఇచ్చి ప్రతి అంశంపై వివరించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎస్ఈసీ ఆదేశాల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఆర్ ఓ తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, విద్యుత్ సరఫరా, నీటి వసతి తదితర సదుపాయాలు తనిఖీ చేయాలని, సంబంధిత ఎంపీడీఓలు, అధికారులతో ఆ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇంక ఇతర సామగ్రి సరిచూసుకోనేలా పీఓ లు, ఇతర పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వాహనాల్లోనే ఎన్నికల సామగ్రి తరలించాలని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్ ఓలకు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.ఈ శిక్షణలో డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీపీఓ షరీఫుద్దిన్, నోడల్ అధికారి భారతి, ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ హరిత విద్యాలయాలకు ప్రశంసా పత్రాలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లాలోని స్వచ్ఛ హరిత విద్యాలయాలకు ఎంపికైన హెచ్ఎంలు, బాధ్యులకు ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రశంసా పత్రాలు సోమవారం అందజేశారు. స్వచ్ఛ హరిత విద్యాలయాల కోసం సర్వే నిర్వహించగా, జిల్లాలోని 650 స్కూల్స్ సర్వేలో పాల్గొన్నాయి. ఇందులో నుంచి అత్యధిక స్కోర్ పొందిన 8 పాఠశాలలు ఎంపిక అయ్యాయి. కేటగిరి 1 (1 నుంచి 8వ తరగతి వరకు) ఎంపీపీఎస్ నేరేళ్ల, యూ పీ ఎస్ శ్రీ వాణి పోతుగల్, ఎంపీపీఎస్ మర్రిగడ్డ, ఎంపీపీఎస్ సిరిసిల్ల నెహ్రూ నగర్, కేటగిరి %-% 2 కింద (9 నుంచి 12వ తరగతి వరకు) జడ్పీ హై స్కూల్ జిల్లెల్ల, జడ్పీ హై స్కూల్ వెల్జిపూర్, కేజీబీవీ ముస్తాబాద్, వివేకానంద హైస్కూల్ వేములవాడ ఎంపికకాగా, ఆయా విద్యా సంస్థల హెచ్ఎంలు, బాధ్యులను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించి, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రశంసా పత్రాలు అందజేసి, వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

- **అభినందించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్ లో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన ఎంపీపీఎస్ నెహ్రూ నగర్..**

ఎస్‌హెచ్‌వీఆర్ 2025 లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్ కార్యక్రమంలో మన జిల్లాలో 650 పాఠశాలలకు సర్వే నిర్వహించడం జరిగింది. ఇందులో కేటగిరి-1 అర్బన్ విభాగంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెహ్రూనగర్ అత్యధిక స్కోర్ తో మొదటి స్థానంలో నిలిచి జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ అందుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వినోద్ కుమార్, ఎస్.ఓ. పి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.



## ప్రణాళిక ప్రకారం చదివి.. ఉన్నత స్థానాలకు ఎదగాలి..



- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **బోయినిపల్లి మోడల్ స్కూల్ లో ఆకస్మిక తనిఖీ.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బోయినిపల్లి మోడల్ స్కూల్‌ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కీలక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. తనిఖీలో భాగంగా ఆమె ముందుగా పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం విద్యాలయం ఆవరణ పరిశుభ్రతను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ, తయారీని పరిశీలించి, మెనూ ప్రకారం ఏ ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారో నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. 7వ తరగతి గదిలో ఇంగ్లీష్ పాఠం కొనసాగుతుండగా పరిశీలించి, విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ప్రతి రోజూ స్కూల్‌కు రావాలని సూచించారు. ఫిబ్రవరిలో సిలబస్‌ను పూర్తి చేయాలని, ఆ తరువాత వార్షిక పరీక్షలకు సాధన చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులందరూ అన్ని పాఠ్యాంశాలపై పట్టు సాధించాలని, ముఖ్యంగా ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడేలా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## బి.సి. స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత అవగాహన, ఐఈఎల్‌టీఎస్ శిక్షణ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్రంలోని బిసి, ఇతర విద్యార్థులకు విదేశాలలో వున్న అత్యున్నత విశ్వ విద్యాలయాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను, విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇవ్వబడుతున్న అంతర్జాతీయ స్కాలర్షిప్లు పొందడం లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు, శిక్షణా కార్యక్రమాలను తెలంగాణ బి.సి. స్టడీ సర్కిల్ వారు ప్రారంభించడం జరుగుతుంది. ఇట్టి కార్యక్రమంలో భాగంగా బి.సి స్టడీ సర్కిల్ రాజన్న సిరిసిల్ల లో విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు గల అవకాశాలను వివరించేందుకు అవగాహన కార్యక్రమాలను, శిక్షణ తరగతులు ప్రారంభించడం జరుగుతుంది. పైన తెలుపబడిన అవగాహన కార్యక్రమాలకు, %క్మీజుూూ% శిక్షణ తరగతులుకు హాజరు అవ్వుటకు ఆసక్తి వున్న గ్రాడ్యుయేషన్ (ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్) ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు తేదీ.01.12.2025 నుండి 21.12.2025 వరకు టి.జి.బి.సి.స్టడీ సర్కిల్ వెబ్సైట్ www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవచ్చు. మరింత సమాచారం కొరకు ఈ నెంబర్ కు పని వేళలో సంప్రదించగలరు ఫోన్ నెం:040-24071178, 08723-223004

# సిరీస్ కైవసమే లక్ష్యంగా




- నేడు భారత్-దక్షిణాఫ్రికా రెండో వన్డే
- మ్యాచ్ మధ్యాహ్నం 1.30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో-హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

**బలగం టీవీ, హైదరాబాద్**

రాంచీలో జరిగిన తొలి వన్డేలో ఉత్కంఠ భరితంగా గెలిచి 1-0 ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు, మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను నేడు రాయ్‌పూర్‌లోనే ఖాయం చేసేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు సఫారీలు మాత్రం ఈ మ్యాచ్‌ను గెలిచి సిరీస్‌ను మూడో వన్డే వరకు తీసుకెళ్లాలనే పట్టుదలతో బరిలోకి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో ఇరుజట్ల మధ్య ఆసక్తికర పోరు చోటుచేసుకోనుంది.

**రోహిత్-కోహ్లీపై ఫోకస్**

టీ20లు, టెస్టులకు గుడ్‌బై చెప్పి వన్డేలకే పరిమితమైన రోహిత్, కోహ్లీ జోడీపై అభిమానుల దృష్టి కేంద్రీకృతమైంది. రాంచీలో 32వేల మంది హాజరైనట్లే రాయ్‌పూర్ కూడా ఇదే జంటను చూసేందుకు జనసంద్రమైపోగా ఉందని అంచనా. వన్డేలకు ఆతిథ్యమివ్వడం రాయ్‌పూర్‌కు రెండోసారి కావడంతో స్టేడియం మరోసారి 'రోకో' జోడీకి రసవత్తర స్వాగతం పలికేలా తయారైంది.

భారత్ బ్యాటింగ్ బలం సమృద్ధిగానే ఉన్నప్పటికీ జైస్వాల్, రుతురాజ్ గత మ్యాచ్‌లో విఫలమైన విషయం ఇబ్బంది కలిగిస్తోంది. మరోవైపు రాంచీ వన్డేలో బౌలింగ్ బలహీనంగా కనిపించింది. 350 లక్ష్యాన్ని ఇచ్చినా భారత పేసర్లు ఒత్తిడిలో పడ్డారు. అయితే రాయ్‌పూర్ పిచ్ సీమర్లకు అనుకూలం కావడంతో ఈసారి భారత బౌలర్ల నుంచే అధిక ఆశలు ఉన్నాయి.

గాయం కారణంగా తొలి వన్డేకు దూరమైన సౌతాఫ్రికా రెగ్యులర్ కెప్టెన్ టెంబా బవుమా ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేసేందుకు సిద్ధం అయ్యాడు. అతడితో పాటు స్పిన్నర్ కేశవ్ మహారాజ్ కూడా జట్టులో చేరే అవకాశాలుండటంతో సఫారీల బౌలింగ్, బ్యాటింగ్ రెండూ మరింత బలోపేతం కానున్నాయి.

బవుమా తిరిగి రావడంతో డికాక్ లేదా రికెల్టన్‌లో ఎవరో ఒకరు బెంచ్‌కు పరిమితం కానున్నారు. మిడిలార్డర్‌లో బ్రీట్జ్‌కే, జోర్జి, బ్రెవిస్ వంటి శక్తివంతమైన బ్యాట్స్‌మెన్, లోయరార్డర్‌లో యాన్సెన్, బాష్ ఉండటంతో సఫారీ బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తున్నది.

## పార్లమెంట్‌లో 2వ రోజూ ఆందోళనలు

(మొదటి పేజీ తరువాయి)

సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఎన్నికల సంస్కరణలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కిరణ్ రిజిజు అన్నారు. అయితే రాజ్యసభ రూల్ 267 ప్రకారం సర్‌పై తక్షణ చర్చ చేపట్టవచ్చని మల్లికార్జున ఖర్గే, సీపీఐ(ఎం) రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్, టీఎంసీ ఎంపీ డెరిక్ ఓబ్రియన్, డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ డిమాండ్ చేశారు. అనంతరం సర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం సభ మణిపూర్ వస్తువులు, సేవల పన్ను(రెండో సవరణ) బిల్లు-2025 చర్చించి ఆమోదం తెలిపింది. అనంతరం సభ్యులు అత్యవసర ప్రాముఖ్యత కలిగిన అంశాలను లేవనెత్తారు. ఆ తరువాత సభను నేటికి వాయిదా వేశారు.

ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)' వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదుట ప్రతిపక్ష నేతలంతా 'సర్' కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, సీపీఐ(ఎం) ఎంపీలు కె.రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, డీఎంకేకు చెందిన కనిమొళి, టీఆర్ బాలు, ఇతర పార్టీల ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు, పోస్టర్లు పట్టుకొని నిరసన తెలిపారు. అలాగే 'స్టాప్ సర్-స్టాప్ ఓటు చోరీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్ తో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ నిరసన కొనసాగిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు.

## కాంగ్రెస్ భూ కుంభకోణంపై 'బీఆర్ఎస్' పోరుబాట

(మొదటి పేజీ తరువాయి)

**హెచ్ఐఎల్‌టీపీ స్కామ్ నిజనిర్ధారణ బృందాల పర్యటన వివరాలు**

డిసెంబర్ 03, 04 తేదీలలో హెచ్ఐఎల్‌టీపీ స్కామ్‌పై నిజనిర్ధారణ కోసం బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఎనిమిది బృందాలు ఆయా ప్రాంతాల్లో పర్యటించనున్నాయి. ఇందులో భాగంగా క్లస్టర్-1లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలో గంగుల కమలాకర్, దేశపతి శ్రీనివాస్ మరియు మెదక్ ఎమ్మెల్యేల బృందం పాశమైలారం, పటాన్ చెరువు, రామచంద్రాపురం ప్రాంతాలను సందర్శిస్తారు. క్లస్టర్-2లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, సురభి వాణీ దేవి, ఉప్పల్ నాయకులు కలిసి నాచారం, మల్లాపూర్, ఉప్పల్, చర్లపల్లి ప్రాంతాల్లో పర్యటిస్తారు.

క్లస్టర్-3లో శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మర్రి రాజశేఖర్ రెడ్డి, రవీందర్ రావు మౌలాలి మరియు కుషాయిగూడ పారిశ్రామిక వాడలను విజిట్ చేస్తారు.ముఖ్యంగా క్లస్టర్-4లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సత్యవతి రాథోడ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానందతో కలిసి జీడిమెట్ల, కూకట్‌పల్లి ప్రాంతాల్లో పర్యటించనున్నారు.క్లస్టర్-5లో తలసాని శ్రీనివాస్ యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్, నవీన్ రావు సనత్ నగర్, బాలానగర్ ఏరియాలను పరిశీలిస్తారు. క్లస్టర్-6లో చామకూర మల్లారెడ్డి, శంభీపూర్ రాజు మేడ్చల్ ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్తారు. క్లస్టర్-7లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, స్వామి గౌడ్, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, కార్తీక్ రెడ్డి కాటేదాన్ మరియు హయత్ నగర్ లో పర్యటిస్తారు. చివరగా క్లస్టర్-8లో మాజీ మంత్రి మహమూద్ అలీ, దాసోజు శ్రవణ్, ఎండీ సలీం చందులాల్ బారాదరి పారిశ్రామిక వాడను సందర్శించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తారు.

## అమెరికాలో 'ది రాజా సాబ్' అడ్వాన్స్ బుకింగ్స్ స్టార్ట్

- రన్‌టైమ్ 3 గంటల 14 నిమిషాలు

**బలగం టీవీ, హైదరాబాద్**



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ లిలి'ది రాజా సాబ్'లిలిపై అభిమానుల్లో ఉత్సాహం సృష్టిస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ఓ చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో భారీ హడావుడి తెప్పించింది. అమెరికాలో ముందస్తు బుకింగ్స్ ప్రారంభమయ్యాక సినిమా రన్‌టైమ్ 3 గంటల 14 నిమిషాలు అని బయటకు రావడంతో అంచనాలు మరింత భారీ అయ్యాయి. మారుతి సినిమాలు సాధారణంగా తక్కువ నిడివి కలిగుంటాయి. కానీ ప్రభాస్ ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు ఈ సారి భారీ స్థాయిలో సినిమా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. 'సలార్', 'కల్కి' లాగా సుదీర్ఘ రన్‌టైమ్‌తో ప్రేక్షకులకు పూర్తి వినోదం ఇవ్వాలని టీమ్ సిద్ధమవుతోంది. సినిమా షూటింగ్ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. అమెరికాలోని ప్రధాన టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫార్మ్‌ల్లో రన్‌టైమ్ అధికారికంగా పొందుపరగడంతో ఈ సమాచారం ధృవీకృతమైంది. ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక ప్రతినాయకుడి పాత్రలో కనిపించనుండగా, యోగిబాబు, బ్రహ్మాజీ, మురళీ శర్మ వంటి ప్రముఖులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మొదట ఈ చిత్రాన్ని 2025 డిసెంబర్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ, పోస్ట్ ప్రొడక్షన్ పనుల కారణంగా విడుదల తేదీని మారుస్తూ 2026 జనవరి 9కి ఖరారు చేశారు.




## 'సైక్ సిద్ధార్థ' ట్రైలర్ విడుదల

- అడల్ట్ కామెడీతో డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటించిన 'సైక్ సిద్ధార్థ' సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. "మీలాంటి యువకుడి కథ" అనే ఉపశీర్షికతో వస్తున్న ఈ చిత్రం పూర్తిస్థాయి అడల్ట్ కామెడీగా రూపొందింది. వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు హీరో నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నాడు. కొత్త తరానికి నచ్చేలా బోల్డ్ కంటెంట్, బూతు సంభాషణలు, ఓపెన్ కామెడీతో ట్రైలర్‌ను మేకర్స్ కట్ చేశారు. దాంతో సినిమా అడల్ట్ ప్రేక్షకులను ప్రధానంగా లక్ష్యంగా పెట్టుకున్నదనే భావన స్పష్టంగా కనిపిస్తుంది. 'సైక్ సిద్ధార్థ' చిత్రం డిసెంబర్ 12న థియేటర్లలో విడుదల కానుంది.




## 'మౌగ్లీ 2025' ట్రైలర్ విడుదల

- డిసెంబర్ 12న గ్రాండ్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ స్టార్ యాంకర్ సుమ కనకాల తనయుడు, యువ నటుడు రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మౌగ్లీ 2025' ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. నేషనల్ అవార్డ్ విన్నర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే షఉటింగ్ పూర్తయిన ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. రోషన్‌కు జోడిగా సాక్షి సాగర్ మదోల్కర్ నటిస్తుండగా, వైవా హర్ష ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. యువ సంగీత దర్శకుడు కాలా భైరవ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. సరికొత్త కాన్సెప్ట్, రాబోయే సంవత్సరాన్ని నేపథ్యంగా తీసుకుని రూపొందించిన స్టైలిష్ యాక్షన్-డ్రామాగా 'మౌగ్లీ 2025' రోషన్ కెరీర్‌లో కీలక చిత్రంగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై లోక్‌సభలో చర్చకు అంగీకారం

(మొదటి పేజీ తరువాయి)

విధంగా కాలపరిమితిని ఖరారు చేయడం సాధ్యం కాదని అధికార పక్షం స్పష్టం చేసింది. మంగళవారం సమావేశాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో స్పీకర్ ఓం బిర్లా అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అధికార పక్షం చర్చకు అంగీకారం తెలిపింది. అయితే ప్రత్యేకంగా 'సర్'పై కాకుండా ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందుకు ఉంచనున్నారు.

## పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పకుంటే సినిమాలు ఆడనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

అజ్ఞానం. తెలంగాణ ప్రజలను అవమానించినందుకు పవన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో ఆయన సినిమాలు తెలంగాణలో ఆడనివ్వం" అని కోమటిరెడ్డి హెచ్చరించారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా పవన్ వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ-ఆంధ్ర రాష్ట్రాలు అన్నదమ్ముల్లా ఉన్నాయన్నారు. "కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతే అది ప్రకృతి వైపరీత్యం. దానికి తెలంగాణ ప్రజల దిష్టి అంటేం పవన్ కల్యాణ్ వెంటనే వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని క్షమాపణ చెప్పాలి. లేదంటే ఆయన సినిమాలు ఇక్కడ ఆడనివ్వం" అని ఆయన స్పష్టం చేశారు. అదే సందర్భంలో, పవన్ వ్యాఖ్యలపై తమ మిత్రపక్షం అయిన టీఎస్ బీజేపీ నాయకులు, అలాగే ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు.

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి కూడా పవన్ వ్యాఖ్యలను ఖండించారు. "ఉప ముఖ్యమంత్రి హోదా మరిచిపోయి మాట్లాడకూడదు. కోనసీమలో ఉన్న వాస్తవ సమస్యలను మాట్లాడాలి గాని దిష్టి కథలు చెప్పకూడదు" అని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి, సంక్షేమంలో పరస్పరం పోటీ పడుతూ దేశానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఏపీ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లి ప్రాంతంలో నవంబర్ 26న కొబ్బరి చెట్ల ఎండిపోవడంపై పరిశీలనలు చేసిన పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "గోదావరి జిల్లాలు పచ్చగా ఉండటాన్ని తెలంగాణ నాయకులంతా ప్రశంసిస్తుంటారు. ఇప్పుడు కొబ్బరి చెట్లు మొండాలతో కనిపిస్తున్నాయి. చెట్లకు దిష్టి తగిలినట్లుంది" అని వ్యాఖ్యానించారు.